మూడు నెలలకు సరిపడా..

ముగిసిన రేషన్ బియ్యం పంపిణీ

- జిల్లావ్యాప్తంగా 86 శాతం మంది స్వీకరణ
- మళ్లీ సెప్టెంబర్‌లోనే..

మెదక్‌జోన్: వానాకాలం నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకూడదని కేంద్రం ప్రభుత్వం మూడు నెలల బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింటి. ఈక్రమంలో జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేసింది. జిల్లావ్యాప్తంగా 521 రేషన్ దుకాణాలు ఉండగా, 2.16 లక్షల పైచిలుకు వివిధ రకాల కార్డుదారులు ఉన్నారు. జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన బియ్యం జూన్‌లోనే పంపిణీ చేశారు. దీంతో ప్రజలు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరి బియ్యం తీసుకున్నారు. గతంలో బియ్యం నెలకు 82 నుంచి 83 శాతం లబ్ధిదారులు మాత్రమే తీసుకోగా, మూడు నెలలకు సంబంధించి మాత్రం 86 శాతం మంది తీసుకున్నారు.

వలసదారులు ఇతర జిల్లాలో..

జిల్లాలో మొత్తం 2,16,716 రేషన్ కార్డులు ఉండగా, బియ్యం తీసుకున్న లబ్ధిదారులు 1,86,578 మంది ఉన్నారు. మూడు నెలలకు సంబంధించి 13,922 మెట్రిక్ టన్నుల (ఎంటీస్) బియ్యం తీసుకోవాల్సి ఉండగా, 86 శాతం అనగా 11,972 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా మూడు నెలలకు సంబంధించి లబ్ధిదారులు వేలిముద్రలు మూడు సార్లు వేయాల్సి రావటంతో కొన్ని దుకాణాల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాగా, అధికారులు వాటిని అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషిచేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండడంతో మిగితా 14 శాతం మంది వివిధ ప్రాంతాల్లో బియ్యం తీసుకుని ఉంటారని అధికారులు చెబుతున్నారు. కాగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి లాంటి నగరాల్లో 110 నుంచి 120 శాతం వరకు సన్నబియ్యం తీసుకున్నట్లు సమాచారం.



నెలంతా పంపిణీ చేశాం



మూడు నెలల రేషన్ బియ్యం జూన్ నెల మొత్తం రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేశాం. సాధారణ రోజుల్లో నెలకు సంబంధించి బియ్యం పంపిణీ కేవలం 15 రోజుల పాటే ఇచ్చేది. కాగా గతంలో ప్రతి నెల 82 నుంచి 83 శాతం మంది లబ్ధిదారులు బియ్యం తీసుకునేవారు. మూడు నెలల కోటాకు సంబంధించి 86 శాతం బియ్యం తీసుకున్నారు.

– నిత్యానందం, డీఎస్‌ఓ

క్లుప్తంగా

జీఓను రద్దు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): పని గంటల విధానాన్ని మారుస్తూ తీసుకవచ్చిన 282 జీఓను రద్దు చేయాల్సిందేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన జీఓ ను ప్రభుత్వం ఉపసంహరించేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్ రద్దు చేయాలన్నారు. ఈ నెల 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం

తహసీల్దార్ మాలతి



మాట్లాడుతున్న తహసీల్దార్ మాలతి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులతో పాటు ఇతర సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందిస్తే పరిష్కారం చూపుతామని చిన్నశంకరంపేట తహసీల్దార్ మాలతి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణికి హాజరుకాలని కోరారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎంపీపీ, పీహెచ్‌సీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

పాటల పల్లకీని విజయవంతం చేయండి

తెలంగాణ సింగర్ కిషోర్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: 13న మెదక్‌లోని టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించే పాటల పల్లకి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ సింగర్ నేర్నాల కిషోర్ పేర్కొన్నారు. సోమవారం మెదక్‌లో ఎమ్మెల్యే రోహిత్‌రావును కలిసి అందుకు సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రం కోసం గొంతెత్తి పాడిన ఎంతో మంది కళాకారులను అప్పటి ప్రభుత్వం గుర్తించలేదని కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి జిల్లాలో కొనసాగిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కళాకారులు ప్రసాద్, సత్యనారాయణ, నర్సింలు, బొంతపల్లి ఎల్లన్న, రమేష్, తదితరులు ఉన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల ఫొటోలను తీసివేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆరోపిస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు కులమతాలకతీతంగా విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు ఫొటోలను తీసి పక్కనబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు ఎస్‌ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, విద్యార్థి నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, సాయికుమార్, శ్రీపాల్, సురేందర్‌గౌడ్, నరేశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

సిద్దిపేటఅర్బన్: తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన గణేశ్ జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పొన్నాల ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లలను సోమవారం ఎల్‌కేజీ, ఒకటో తరగతిలో చేర్పించారు. సిద్దిపేట నుంచి పొన్నాల పాఠశాలకు చేరేందుకు గాను ఆటో ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోరా?



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన నాయకులు

రామాయంపేట(మెదక్): బీడీ కార్మికులకు విక్రయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీడీ కార్మికులు, వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 1597 సర్వే నంబరులో రెండెకరాల భూమిని గతంలో ఒక వ్యక్తి బీడీ కార్మికులకు విక్రయించాడన్నారు. ఆ వ్యక్తి తిరిగి భూములను స్వాధీనం చేసుకుని ఇతరులకు విక్రయించాడని ఆరోపించారు. అనంతరం వారు తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ బాల్‌రాజుకు కూడా ఫిర్యాదు చేశారు. యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం సభ్యులతోపాటు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

రాంపూర్ గ్రామస్తుల ఫిర్యాదు

కొల్చారం(నర్సాపూర్): రాంపూర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 373 తేనె కుంట 4.30 ఎకరాలు, కప్పల కుంటలోని 4 ఎకరాలతో పాటు మరో 4 ఎకరాల భూమి గతంలో గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు కబ్జా చేయడంతో అప్పట్లో గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఆ భూమిలో ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు సైతం పాతారు. తాజాగా మరోసారి అదే వ్యక్తి ఆదివారం ట్రాక్టర్లతో చదును చేయడంతో మరోసారి వివాదంగా మారింది. దీంతో గ్రామస్తులు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తి.. అడ్డుకుంటున్నవారిని దుర్భాషలాడటంతో పాటు దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ 24 గంటల్లోగా పూర్తి విచారణ జరిపి, ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లు తేలితే సదరు వ్యక్తిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మంది అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 260 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి గ్రామశివారులోని హనుమాన్ వెంచర్‌లో ఎనిమిది మంది యువకులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ శివానందం తన సిబ్బంది, క్లూస్ టీంతో కలిసి దాడి చేసి.. ఆరుమందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు యువకులు తప్పించుకొని పారిపోయారు. నిందితుల నుంచి 260 గ్రాముల గంజాయిని, ఐదుసెల్ ఫోన్లు, రెండు టూ వీలర్ల వాహనాలు, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందం, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్, చిత్రంలో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ శివానందంలు

సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

టేక్మాల్(మెదక్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజెన్స్ కన్వర్షన్ జాక్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనర్సింహ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన టేక్మాల్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించే నిరవధిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖలో వెట్టిచాకిరి చేస్తున్నా సరిపడా వేతనం ఇవ్వడంలేదన్నారు. ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం, సంస్థ రక్షణ కొరకు నిర్వహించే సమ్మెకు విద్యుత్ ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దుర్గేష్, సంయుక్త కార్యదర్శి సురేష్, కో-కన్వీనర్ రాజిరెడ్డి, నాయకులు దేవరాజు, ప్రవీణ్‌గౌడ్, దస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సలాబత్‌పూర్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులకు ఇంటికి ముగ్గు వేసి భూమిపూజ చేశారు. గ్రామానికి పది ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. ఇంటి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని, నాలుగు విడతలలో ప్రభుత్వం రూ 5లక్షలు చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ నాయకులు ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు జీఓ ప్రతుల దహనం

చేగుంట(తూప్రాన్): పనిగంటల పెంపును నిరసిస్తూ చేగుంటలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పని గంటలను పెంచే 282 జీఓను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈజీఓతో కార్మికులు తీవ్ర శ్ర దోపిడీకి గురవుతారని పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే జీఓను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

జీఓ రద్దు చేయాలని వినతి

వెల్దుర్తి(తూప్రాన్): పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచుతూ ప్రభుత్వం తెచ్చిన జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నరేందర్ తహసీల్దార్ బాలలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, లాభాల కోసమే తెచ్చిన ఈ జీఓను వెంటనే తొలగించాలన్నారు. కార్మికుల హక్కులు కాలరాసేలా ప్రభుత్వ చర్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఆలయానికి భూ విరాళం

శివంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండిగ్రామంలోని పోచమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన దంపతులు భూమిని విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన మేఘమాల వెంకటరెడ్డి దంపతులు ఆలయానికి ఆనుకొని ఉన్న వారి పట్టా భూమిలో ఆరు గుంటల భూమిని సోమవారం ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. విలువైన పట్టా భూమిని ఆలయ అభివృద్ధి కోసం అందజేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

స్టేషనరీ అమ్మకం అరికట్టాలి

చేగుంట(తూప్రాన్): ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు స్టేషనరీ వ్యాపారాన్ని అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ రాంసింగ్ పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు స్టేషనరీని మార్కెట్ రేటు కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు స్టేషనరీ అమ్మకాలతో విద్యార్థుల తల్లిదండ్రులు వేలాది రూపాయలను నష్టపోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో స్టేషనరీ వ్యాపారం అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పీఆర్టీయూ సమావేశం

మెదక్ కలెక్టరేట్: పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం మెదక్‌జిల్లా కేంద్రంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశారు. రాష్ట్ర అధ్యక్షుల నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, 15 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏకవాక్య తీర్మానంతో హర్షం వ్యక్తం చేశారు.

◆ ఐడీ కార్డులు, బెల్ట్‌ల పంపిణీ

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లి గ్రామంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులతో పాటు బెల్ట్‌లు ప్రదానం చేశారు. దాతల సహకారంతో విద్యార్థులు మంచిగా చదువుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మహంకాళీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

◆ మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



నర్సాపూర్: మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్ రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం సన్మానించారు. మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో మాజీ వార్డు మెంబరు రషీద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు శ్రీరాంచరన్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ పీర్ల ఊరేగింపు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌తో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం పీర్ల ఊరేగింపు పండుగ జరిగింది. మౌలాలి, బీబీఫాతిమా, హుస్సేన్ బాష, ఇమామే ఖాసీం, నాల్‌సాబ్ తదితర పీర్ల సవారీలు అసైదుల్లా ఆటపాటలు, బాజా బజంత్రీలతో పురవీధుల గుండా కొనసాగాయి. భక్తులు ఒడిబియ్యం, పువ్వులు, దట్టీలు, కందూర్లతో తమ మొక్కులను చెల్లించుకున్నారు.

96 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



నార్సింగిలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో 96 మందికి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు జరుగుతోందన్నారు. నార్సింగిలో ప్రత్యేక నిధులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.3,12,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, రాజేష్, సంపత్‌రెడ్డి, బాచిస్వామి, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి, ఎంఈ భాకర్, రకోద్దీన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించండి

ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలని నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక రైతువేదికలో సోమవారం బీఎల్‌ఓలకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి 18 యేళ్లు నిండి, ఓటుహక్కు లేని వారిని గుర్తించి ఓటరు నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాలు మార్పులు, చేర్పులు చేయాలని చెప్పారు. ఎన్నికల విధులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్‌స్థాయి అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి

జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి బీజేపీ నేతల వినతి

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ ఎమ్మెల్సీ అంజిరెడ్డికి మండల బీజేపీ అధ్యక్షుడు రాకేష్ వినతి పత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన భరోసా కార్యక్రమంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత విధానం వల్ల హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న మెదక్ జిల్లాను సిరిసిల్లాజోన్‌లో కలిపారని చెప్పారు. దీంతో ఇక్కడ ఉద్యోగులు, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నీరుడి సాయి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

విద్యార్థులకు ఆట సామగ్రి అందజేత



అట సామగ్రి షూ అందజేస్తున్న మల్లేష్ దంపతులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పుట్టి మల్లేష్ సంధ్య దంపతులు సోమవారం ఆట సామగ్రితో పాటు షూస్, జాతీయ నాయకుల ఫొటోఫ్రేమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆట సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఉపాధ్యాయులు శంకర్‌రావు, యోగేశ్వరరావు, సీఆర్‌పీ గోపాల్, వంజరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరం

గ్రంథాలయ జిల్లా చైర్మన్ అంజయ్య

రాయికోడ్(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని గ్రంథాలయ జిల్లా చైర్మన్ జి.అంజయ్య అన్నారు. మండలంలోని నాగ్వార్ గ్రామంలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బెస్మెంట్ తదితర దశల్లో కొనసాగుతున్న ఇళ్లను పరిశీలించారు. బిల్లుల చెల్లింపుపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, విఠల్,పండరి,రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.



భూమిపూజ చేసిన అంజయ్య

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



అల్లాదుర్గంలో.. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నిజాంపేటలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



రామాయంపేటలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్యకర్తలు



చిలప్‌చెడ్‌లో.. జెండాను ఆవిష్కరించిన నాయకులు

జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ నిరంతర పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. వర్గీకరణతో ఎంతో మంది పేద ఉప కులాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.